సాక్షి సూర్యాపేట

గురువారం : 18 ఏప్రిల్ 2024



ప్రశాంత్ అంత్యక్రియలు..
ప్రశాంత్ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జిల్లెళ్లలో అశ్రునయనాల నడుమ జరిగాయి.
- 8లో



క్షుద్ర పూజలు
గుండాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు పసుపు బోసి క్షుద్ర పూజలు చేశారు.
- 8లో

గరిష్ఠం / కనిష్ఠం
43^{o} / 27^{o}

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశాన్ని కోదాడ పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి ఎస్.ఏ.హమీద్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆత్మీయ సన్మానం ఉంటుందని తెలిపారు. సమావేశానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆబిద్



ఆబిద్‌కు నియామకపత్రం ఇస్తున్న సంకినేని

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట పట్టణానికి చెందిన ఎం.డి. ఆబిద్ నియమితులయ్యారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ పాష ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించారు. బుధవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఆబిద్‌కు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు నియామకపత్రం అందించారు. అనంతరం ఆబిద్ మాట్లాడుతూ నియామకానికి సహకరించిన వెంకటేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, చలమళ్ల నర్సింహ, మల్సూర్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను మూసి వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్రంలో బెల్ట్ షాపులను మూసివేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. శిరోమణి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని విక్రమ్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బెల్ట్ షాపులను మూసివేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి రద్దు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఉపాధ్యక్షురాలు రేణుక, కోశాధికారి మోటకట్ల జయమ్మ, దొంతమల్ల విజయ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం





సూర్యాపేట పట్టణంలోని వేదాంత భజనమందిరంలో సీతారాముల కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు, కోదాడ మండలం తమ్మరలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

మోడల్ పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేటటౌన్ : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో 48 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో సంబంధిత ఏఆర్‌ఓలు ప్రాథమికంగా కనీస సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులు ఏర్పాట్లపై పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నేడే నోటిఫికేషన్

లోక్‌సభ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు

- నల్లగొండ, భువనగిరి కలెక్టరేట్లలో ఆర్వో కార్యాలయాల ఏర్పాటు
- అంతా సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం



నల్లగొండ కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ నేడు విడుదల కానుంది. గురువారం నుంచి నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. నల్లగొండకు సంబంధించి నల్లగొండ కలెక్టరేట్‌లో, భువనగిరికి సంబంధించి యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకు కోసం ఆయా కలెక్టరేట్లలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 25వ తేదీతో ముగియనుంది. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీన ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి ఎన్నికల సంఘం గుర్తులను కూడా కేటాయించనున్నారు. నల్లగొండలో ఎన్నికల రిటర్నింగ్‌అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన, భువనగిరికి సంబంధించి రిటర్నింగ్ అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే నామినేషన్లు స్వీకరించనున్నారు. ప్రభుత్వ పని దినాల్లో రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.

నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగనున్నందున నామినేషన్ కేంద్రాల వద్ద భారీ భద్రతను చేస్తున్నారు. సెంట్రల్ ఫోర్స్, ఆర్మ్‌డ్ ఫోర్సెస్, సివిల్ ఫోర్స్‌తో మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

భువనగిరిలో..

భువనగిరి లోక్‌సభకు సంబంధించి ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. వీలైతే ముందుగా వారి తరఫున ఎవరైనా ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 21వ తేదీన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఈనెల 22వ తేదీన, బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఈనెల 22వ తేదీ లేదంటే 23వ తేదీన నామినేషన్ వేయనున్నారు.

నేడు బీజేపీ నల్లగొండ అభ్యర్థి నామినేషన్

బీజేపీ నల్లగొండ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి గురువారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన లేదా ఆయన తరఫున మరెవరైనా నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అలాగే 21వ తేదీన మరో దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 23వ తేదీన బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ సమర్పించే అవకాశం ఉండగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి ఈ నెల 24వ తేదీన నామినేషన్‌ను సమర్పించనున్నారు.

నిప్పుల కుంపటి

- భగ్గుమంటున్న భానుడు
- అత్యధికంగా మునగాలలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో ఐదు మండలాల్లోనూ 44 డిగ్రీలకు పైగానే..
- ఎండతీవ్రతకు అల్లాడుతున్న జనం



నిర్మానుష్యంగా ఉన్న హైదరాబాద్-విజయవాడ హైవే

సూర్యాపేట : జిల్లాలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. 44 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు చేరాయి. జిల్లాలో బుధవారం అత్యధికంగా మునగాల మండలంలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో ఐదు మండలాల్లో 44 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈ ఎండల తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు.

మండలం	గ్రామం	ఉష్ణోగ్రత డిగ్రీల్లో..
మునగాల	మునగాల	44.7
మఠంపల్లి	పెదవీడు	44.5
నూతనకల్	నూతనకల్	44.2
పాలకవీడు	అలంగాపురం	44.2
అనంతగిరి	శాంతినగర్	44.0
మోతె	మామిళ్లగూడెం	44.0

మరో ఐదు మండలాల్లో..

మఠంపల్లి మండలం పెదవీడులో 44.5, నూతనకల్ మండలంలో 44.2, పాలకవీడు మండలం అలంగాపురంలో 44.2, అనంతగిరి మండలం శాంతినగర్, మోతె మండలం మామిళ్లగూడెంలో 44.0 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 12 మండలాల్లో 43 డిగ్రీలు, మరో 5 మండలాల్లో 42 డిగ్రీలకు తగ్గకుండా సూర్య ప్రతాపం కనిపించింది.

వడగాలులతో విలవిల

ఎండతో పాటు విపరీతమైన ఉక్కపోత, వడగాలుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. కొద్దిరోజులుగా ఎండలు తీవ్రంగానే ఉన్నప్పటికీ బుధవారం నాటి ఎండకు జనం బెంబేలెత్తిపోయారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన కల్యాణోత్సవాల్లో ప్రత్యేకంగా కూలర్లు ఏర్పాటు చేసినా చాలావరకు జనం ఎండ తీవ్రతను తట్టుకోలేకపోయారు. ఎక్కడా చూసినా రహదారులు జనసంచారం లేకుండా నిర్మానుష్యంగా మారిపోయాయి. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు ఇళ్లలో ఉన్నప్పటికీ ఉక్కపోతకు తట్టుకోలేకపోయారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రక్తిగట్టించారు. అదేవిధంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం , పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదనచేశారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

నల్లగొండ జీజీహెచ్ పరిశీలన

నల్లగొండ టౌన్ : రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఉదయం నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని సందర్శించారు. ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. తొలుత ఎంసీహెచ్ వార్డుకు వెళ్లి రోగులకు అందుతున్న సేవలు, ఆస్పత్రిలో సౌకర్యాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల హాజరు పట్టికను పరిశీలించారు. వైద్యం పొందుతున్న రోగుల వివరాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో లిఫ్టు పనిచేయకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించగా మరమ్మతులో ఉందని, మరమ్మతు చేయడానికి పది రోజుల సమయం పడుతుందని సమాధానం చెప్పడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల భవనం నెల రోజుల్లో పూర్తి చేయాలని, అందరికీ అనువుగా ఉండేలా నిర్మాణం జరగాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. భవన నిర్మాణ పనుల పురోగతిపై రెండు రోజులకోసారి తెలుసుకుంటానని పేర్కొన్నారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానందం, ఆర్‌ఎంఓ డాక్టర్ ప్రశాంత్, ఈఈ అజీజ్ ఉన్నారు.

10లక్షల టన్నుల సీఎంఆర్ ధాన్యం మాయం!

- విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో గుర్తింపు
- మిల్లు లేకున్నా ధాన్యం కేటాయించిన వైనం
- ప్రభుత్వానికి నివేదిక అందించిన అధికారులు



తిరుమలగిరిలోని సంతోష్ రైస్ ఇండస్ట్రీలో తనిఖీలకు వచ్చిన అదనపు కలెక్టర్ ప్రియాంక (ఫైల్)

సూర్యాపేట : సీఎంఆర్ ధాన్యం విషయంలో తవ్వినకొద్దీ అవినీతి అక్రమాలు బయటపడుతున్నాయి. సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధుల అండతో మిల్లర్లు అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు చివరికి మిల్లు లేకపోయినా ధాన్యం కేటాయించడం గమనార్హం. ఇలా కేటాయింపులు జరిపిన మిల్లులకు సంబంధించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించి తలాకొంత బుక్కేసినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా మంగళవారం పలు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించగా రూ.220కోట్ల విలువైన 10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం అయినట్లు తేలినట్లు తెలిసింది.

రూ.220కోట్ల ధాన్యం..

జిల్లాలోని తిరుమలగిరి, నాగారం, కోదాడ, చివ్వెంలలోని మిల్లుల్లో టాస్క్‌ఫోర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం ప్రస్తుతం మిల్లుల్లో ఉన్న నిల్వల్లో తేడాలను గుర్తించారు. ఆయా మిల్లుల్లో ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం రూ.220కోట్లు విలువ చేసే 10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించినట్లు తెలిసింది. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని మిల్లుల్లో దాదాపు రూ.500కోట్ల సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారుల అంచనావేస్తున్నట్లు సమాచారం.

ఎంతకూ ఇవ్వకపోవడంతో..

తిరుమలగిరిలో సంతోషిమాత, రఘురామ, బాలాజీ రైస్ మిల్, శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్‌లతో పాటు ఫణిగిరి వద్ద సంతోషి రైస్ మిల్, హర్షిత రైస్ మిల్ ఉన్నట్లు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య అధికారులతో అగ్రిమెంట్ చేసుకొని ధాన్యం కేటాయింపులు చేయించుకున్నట్లు తెలిసింది. 2022 – 23 యాసంగి, 2023– 24 వానాకాలం సీజన్లలో ఈ మిల్లులకు ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించగా సకాలంలో సీఎంఆర్ అందించలేదు. పలుమార్లు గడువు పెంచినా అప్పటి బీఆర్‌ఎస్‌కు చెందిన నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండతో లేని ధాన్యం ఉన్నట్లు అధికారులను పక్కదోవ పట్టించారన్న ఆరోపణలున్నాయి. ఎంతకూ కస్టమ్ మిల్లింగ్ రైస్ రాకపోవడంతో అధికారులు మిల్లును తనిఖీ చేశారు. వీటిలో ఫణిగిరి వద్ద సంతోషి రైస్ మిల్, హర్షిత రైస్ మిల్ లేకుండా కూడా ధాన్యం కేటాయింపులు చేసినట్లు ఈ తనిఖీల్లో తేల్చినట్లు తెలిసింది.

పెండింగ్ సీఎంఆర్ మిల్లుల్లో తనిఖీలు

- కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో సీఎంఆర్ అందించని కొన్ని మిల్లుల్లో తనిఖీలు నిర్వహించినట్లు కలెక్టర్ ఎస్. వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజిలెన్స్ అండ్ టాస్క్ ఫోర్స్ కమిటీలు ఈనెల 16న పెండింగ్ సీఎంఆర్ ఉన్న మిల్లుల్లో తనిఖీలు చేసి, నిల్వల్లో పెద్దమొత్తంలో తేడాలను గమనించి, పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందించామని వివరించారు. తిరుమలగిరి, కోదాడలోని మిల్లులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, మిల్లుల యాజమాన్యాలపై ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి మిల్లు నివేదికను ప్రభుత్వానికి పంపించినట్లు పేర్కొన్నారు. ఇంకా కొన్ని మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తామని, పెండింగ్ సీఎంఆర్ అందించకపోతే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆ ఇద్దరి సహకారం.. మిల్లర్ స్వాహాకార్యం!

- కోదాడలో ఎన్‌పీఏ అయిన మిల్లుకు సీఎంఆర్ ధాన్యం ఇప్పించడంలో అధికారుల కీలకపాత్ర
- ఒక అధికారికి రూ. 36 లక్షలతో కారు బహుమతి
- మరో అధికారి కూతురి పెళ్లికి భారీ నజరానా
- కొందరు మిల్లర్ల ఫిర్యాదుతో లోతుగా విజిలెన్స్ అధికారుల విచారణ



కోదాడలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కోదాడ: కోట్ల రూపాయల కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించిన కోదాడ రైస్ మిల్లర్‌కు గతంలో జిల్లా స్థాయిలో పని చేసిన ఇద్దరు అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయించినట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీనిపై ఇంకా లోతుగా విచారణ చేయడంతో పాటు ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందో తెలుసుకునేపనిలో పడినట్లు సమాచారం.ఒక జిల్లా స్థాయి అధికారికి ఏకంగా రూ. 36 లక్షలతో కారు కొనివ్వడమే కాకుండా మరో అధికారి కూతురి పెళ్లి విందుకు అయిన ఖర్చు మొత్తం ఈ మిల్లరే భరించినట్లు విజిలెన్స్ అధికారులకు కొందరు మిల్లర్లు ఫిర్యాదు చేయడంతో దానిపై కూడా సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. మిల్లర్ నీల సత్యనారాయణ కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించడమే కాకుండా పలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగవేతకు పాల్పడంతో పాటు ఓ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్‌పై సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడిగా ఉండడంతో ఇతనిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని ఇటీవల జిల్లా ఎస్పీ ఆదేశించినట్లు సమాచారం.

నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు..

కోదాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెట్ కోసం హైదరాబాద్‌లోని ప్రశాంత్ నగర్‌కు చెందిన కెనరా బ్యాంక్ నుంచి 2016లో రూ.70 కోట్ల రుణం పొందారు. ఆ రుణం చెల్లించకపోవడంతో బ్యాంక్ సదరు మిల్లును 2018లో ఎన్‌పీఏ(నాన్ పర్ఫామింగ్ అసెట్స్)గా ప్రకటించింది. మిల్లు ఆస్తులను బ్యాంక్ వేలానికి పెట్టింది. నిబంధనల ప్రకారం ఇలాంటి మిల్లుకు అధికారులు సీఎంఆర్ ధాన్యం కేటాయించకూడదు. కానీ జిల్లాకు చెందిన ఇద్దరు అధికారులు దీనికి ధాన్యం కేటాయిస్తూ వచ్చారు. 2022-23 వానాకాలం, యాసంగి, 2023-24 వానాకాలం సీజన్‌లకు సంబంధించి దాదాపు రూ.100 కోట్ల ధాన్యం ఈ మిల్లుకు కేటాయించడం గమనించదగ్గ విషయం. ఇదే మిల్లర్ కేతేపల్లి వద్ద ఉన్న స్కంధ గాయత్రి మిల్లు కోసం ఇదే కెనరా బ్యాంక్ నుంచి మరో రూ. 27.25 కోట్ల రుణం తీసుకొని చెల్లించకపోవడంతో డిఫాల్టర్‌గా ప్రకటించింది. ఈ మిల్లును 2021లో బ్యాంక్ వేలం వేయగా తన గుమాస్తా సతీమణి పేరుతో రూ. 7.48 కోట్లకు దక్కించుకొని నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

రూ. 64 కోట్ల ధాన్యం పక్కదారి పట్టించాడు : ఆర్డీఓ

కోదాడ కు చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం 2022-23 వానాకాలం, యాసంగి, 2023-24 వానాకాలం సీజన్‌లకు సంబంధించి ఇప్పటి వరకు తేలిన లెక్క ప్రకారం సుమారు రూ. 64 కోట్ల మేర ధాన్యం పక్కదారి పట్టించినట్లు తనిఖీల్లో తేలిందని కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ వెల్లడించారు. ఇంకా పూర్తిస్థాయిలో విచారణ జరపడంతో పాటు సకాలంలో బియ్యం ఇవ్వనందుకు అపరాధ రుసుము విధించే అవకాశం ఉందని ఈ మొత్తం పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు.

శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ యజమానులపై కేసు నమోదు: డీఎస్పీ

కోదాడలోని శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెట్ మిల్లుపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేసినట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మిల్లు యజమానులు నీల సత్యనారాయణ, కొత్తూరు సత్యనారాయణతో పాటు ఇతర భాగస్తులపై ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి పలు పత్రాలను సేకరించాల్సి ఉందని అనంతరం దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా మంగళవారం కోదాడలోనే ఉన్న మిల్లు యజమానులు నీల సత్యనారాయణ, కొత్తూరు సత్యనారాయణలు మిల్లుపై విజిలెన్స్ దాడులు జరుగుతున్న విషయం తెలుసుకొని పరారుకాగా మిల్లు మేనేజర్‌ను కోదాడరూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

కనగల్: మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో మంగళవారం సాయంత్రం యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చనగాని కావ్య (20) గత రెండు సంవత్సరాలుగా ఫిట్స్‌తో బాధపడుతోంది. తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుంది. సోదరుడు నవీన్ ఇంటికి వచ్చి కావ్యను గమనించి, నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కావ్య తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చనగాని కావ్య

విద్యుదాఘాతంలో మహిళ మృతి

రాజాపేట: మండలంలోని కాల్వపల్లి గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకల్ల ఐలయ్య, చంద్రకళ దంపతులు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం చంద్రకళ (55) బట్టలు ఉతికేందుకు నీటికోసం విద్యుత్ మోటార్ ఆన్‌చేయగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న వారు గమనించి, వచ్చి చూసేసరికి విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయి ఉండడంతో ఇంట్లో నిద్రిస్తున్న భర్తకు సమాచారం తెలియజేశారు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చంద్రకళ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా ఏరియా ఆస్పత్రికి చేరుకుని పంచనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బొలేరో వాహనంలో మంటలు

- డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్ మీదుగా వెళ్తున్న బొలేరో వాహనంలో మంటలు చెలరేగాయి. ఇంజన్ నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో గమనించిన డ్రైవర్ అప్రమత్తమై కిందకు దిగాడు. గమనించిన స్థానికులు వాహనం ఇంజన్ డోర్‌ను బలవంతంగా తెరిచి చూడగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వారు అప్రమత్తమై వాహనం మొత్తానికి మంటలు వ్యాపించకుండా వెంటనే ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాహనం థర్మల్ ప్లాంట్‌కు చెందినదని స్థానికులు తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

పెద్దవూర: రేషన్ బియ్యం నిల్వలో తేడాలు ఉండడంతో గుర్రంపోడు మండలం గాసిరాంతండా రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ ఆర్ఐ హబీబ్ తెలిపారు. గురువారం పెద్దవూర మండలంలోని గాసిరాంతండాలో రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేసి, బియ్యం నిల్వలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం డీలర్ మేగావత్ లక్ష్మీపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్లు బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం వహించినా, కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి పక్కదారి పట్టించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మండు వేసవిలో జలకళ

భూదాన్‌పోచంపల్లి: మండు వేసవిలో భూదాన్‌పోచంపల్లి మండలంలోని చెరువులు మత్తడి దూకుతున్నాయి. మూసీ పరీవాహకంలో వరికోతలు ముమ్మరంగా జరుగుతుండడంతో పంటకు నీరు అవసరం ఉండదు. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేశారు. ఎగువ నుంచి కాలువల ద్వారా మూసీనీరు వచ్చి చేరుతుండటంతో పోచంపల్లి, రేవనపల్లి, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల చెరువులు నిండాయి. రెండు రోజులుగా పోచంపల్లి, రేవనపల్లి చెరువులు మత్తడి దూకుతున్నాయి.



అలుగు పోస్తున్న రేవనపల్లి చెరువు



జలసిరితో పోచంపల్లి చెరువు



మత్తడి దూకుతున్న పోచంపల్లి చెరువు

దాతలూ.. ఆదుకోండి

- రోడ్డు ప్రమాదంలో కుమారుడి కన్నుకు గాయం
- తలకు, ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్
- ఆపరేషన్ చేసి కన్ను తీసివేసిన వైద్యులు
- వైద్యానికి ఇప్పటికే రూ.20 లక్షలు ఖర్చు
- నిరుపేద కుటుంబం కావడంతో ఆపన్నహస్తం కోసం వేడుకోలు

కన్నీటి గాథ

చిలుకూరు: వారిది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. ఈ కుటుంబానికి అనుకోకుండా పెద్ద విపత్తు జరిగింది. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబం కష్టంలో పడింది. చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గోపిదేశి వీరబాబు, వెంకటనర్సమ్మకు కుమారుడు ప్రవీణ్ ఉన్నాడు. వీరికి కేవలం 10 గుంటల భూమి ఉంది. వీరబాబు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వెంకటనర్సమ్మ గ్రామ శివారులో ఉన్న గోదాంలో స్వీపర్‌గా పని చేస్తుంది. ఆమె కుమారుడు ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. తల్లి, కుమారుడు ఇద్దరూ కూలీ పనికి వెళ్తూ జీవనం సాగిస్తున్నారు.



హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపిదేశి ప్రవీణ్

ఇంకా రూ.10లక్షలు అవసరం..

గత నెల మార్చి 31న ప్రవీణ్ పని నిమిత్తం కోదాడకు వెళ్లి అనంతరం కోదాడ నుంచి చిలుకూరు మీదుగా స్వగ్రామమైన సీతారాంపురానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో చిలుకూరు వద్ద కారు ఢీ కొని అతడి ఎడమ కన్నుకు తీవ్రంగా గాయమైంది. దీంతో వైద్యులు ఆ కన్నును ఆపరేషన్ చేసి తీసేసారు. కన్ను పూర్తిగా దెబ్బతినడంతో కన్ను ద్వారా తలకు, ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ వచ్చింది. వైద్యానికి మొత్తం రూ.20 లక్షలు ఖర్చు వస్తుందని వైద్యులు తెలిపారు. తన కొడుకును కాపాడుకునేందుకు తనకు ఉన్న 10 గుంటల భూమిని అమ్మగా వచ్చిన రూ.10 లక్షలు ఆస్పత్రిలో చెల్లించింది. ఇంకా రూ.10లక్షల వరకు అవసరం ఉంది. ప్రస్తుతం అప్పు తీసుకువచ్చి కుమారుడికి వైద్యం చేయిస్తోంది. ఆర్థికంగా స్థోమత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

గ్రామస్తుల చేయూత..

ఉన్న భూమిని అమ్మినా వైద్యానికి డబ్బులు సరిపోకపోవడంతో తల్లి అప్పులు చేసి వైద్యం చేయిస్తోంది. విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో కొంత మంది ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మరికొంత మంది చేయూతనందిస్తే తన కుమారుడి ఆరోగ్యం నయం అవుతుందని తల్లి వెంకటనర్సమ్మ పేర్కొంది. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

ఆర్థిక సాయం చేయాల్సిన వారు

గన్నా అన్వేష్
అకౌంట్ నంబర్: 50100513510692
ఐఎఫ్‌సీ కోడ్: హెచ్‌డీఎఫ్‌సీ0001642
బ్రాంచ్ : కోదాడ
ఫోన్ పే లేదా గూగుల్ పే నంబర్ :
99856 26573

బ్యాంకులో రూ.15.50లక్షలు మాయం

- క్యాషియర్‌పై ఫిర్యాదు చేసిన మేనేజర్

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో రూ.15.50 లక్షల నగదు మాయమైంది. బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న కాలేరు అనిల్ కుమార్ మంగళవారం ఉదయం 10 గంటలకు విధులకు హాజరయ్యాడు. 11 గంటల సమయంలో బ్యాంక్ అధికారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా బ్యాంక్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బ్యాంకు మేనేజర్ మౌనిక అనిల్ కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. మేనేజర్‌కు అనుమానం వచ్చి బ్యాంక్ సిబ్బందితో కలిసి క్యాష్ కౌంటర్‌లోని నగదును మంగళవారం సాయంత్రం లెక్కించారు. రూ.15.50 లక్షల నగదు లెక్కలోకి రాకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించారు. బ్యాంక్ నగదుతో ఉడాయించిన క్యాషియర్ అనిల్ కుమార్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని బ్యాంక్ మేనేజర్ మౌనిక బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు.

వైభవంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయమే శివాలయాన్ని తెరిచిన అర్చకులు విశేష పూజలు జరిపించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి సేవను ఊరేగించారు. యాదాద్రీశుడి దేవాలయం తరఫున అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారులు, ఆచార్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శివాలయం ఉత్తర దిశలోని కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ వేడుక నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 12.30గంటలకు శ్రీసీతారామచంద్రస్వామికి పట్టాభిషేకం జరిపించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆయా వేడుకల్లో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీసీతారామచంద్రస్వామికి ముత్యాల తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి స్టేజీ సమీపంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ పట్టుకున్నారు. చందంపేట మండలం నలచెరుముల గ్రామానికి చెందిన ముత్యాలు బొలేరో వాహనంలో 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడ్ చేసుకొని చెర్కుపల్లి స్టేజీ సమీపంలోని ఓ రైస్ మిల్లులో తూకం వేస్తున్నాడు. అప్పటికే సమాచారం అందుకున్న డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యంతోపాటు వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వినియోగదారుల నుంచి రేషన్ డీలర్లు, దళారులు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేయొద్దని, అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే 98488 49126 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

ప్రశాంత్‌కు కన్నీటి వీడ్కోలు

భూదాన్‌పోచంపల్లి: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్(12) అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జిబ్లక్‌పల్లిలో అశ్రునయనాల నడుమ జరిగాయి. ప్రశాంత్ బంజారాహిల్స్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతి చెందగా, అదేరోజు రాత్రి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని జిబ్లక్‌పల్లికి తీసుకువచ్చారు. అప్పటికే మృతుడి ఇంటి వద్దకు గ్రామస్తులు, మృతుడి బంధువులు, వివిధ పార్టీల నాయకులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోచంపల్లి, నారాయణపురం ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, జగన్ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



ప్రశాంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అండ...

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అండగా ఉంటారని డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ తెలిపారు. వారు బుధవారం గాంధీ ఆస్పత్రికి చేరుకుని, మృతుడి తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రూ. 4లక్షల ఆర్థిక సాయంతోపాటు ఇందిరమ్మ ఇల్లు, బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ప్రైవేట్ ఆస్పత్రిలో అయిన ఖర్చు చెల్లిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. అంతిమ సంస్కారాల నిమిత్తం చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి రూ. 20వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేశారు.

డీసీసీబీ చైర్మన్‌ను అభినందించిన కేసీఆర్



మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న కేసీఆర్, చిత్రంలో మదర్ డెయిరీ చైర్మన్, పలువురు పీఏసీఎస్ చైర్మన్లు

నల్లగొండ టౌన్, యాదగిరిగుట్ట : జాతీయ స్థాయిలో ఉత్తమ డీసీసీబీ చైర్మన్‌గా ఇటీవల అవార్డు అందుకున్న నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. అవార్డు అందుకున్న గొంగిడి మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో కలిశారు. నష్టాల్లో ఉన్న బ్యాంకును లాభాల దిశగా ముందుకు తీసుకుపోయి దేశంలోని 540 డీసీసీబీల్లో ఉత్తమ చైర్మన్లుగా ఎంపికైన ఐదుగురిలో మహేందర్‌రెడ్డి ఉండటం తెలంగాణకు గర్వకారణమన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు చింతల దామోదర్‌రెడ్డి, ఎం.మల్లేష్‌గౌడ్, ఎస్.పరమేశ్‌రెడ్డి, ఇ.రాంరెడ్డి, బాల నర్సయ్య, ఎస్.నర్సింహారెడ్డి, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, గుండాల వైస్ చైర్మన్ పురుగుల మల్లేష్‌యాదవ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఢిల్లి మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

చింతపల్లి: తెలుగు పరీక్ష సరిగ్గా రాయలేదన్న సాకుతో ఉపాధ్యాయుడు విద్యార్థిని తీవ్రంగా కొట్టిన సంఘటన చింతపల్లి మండల కేంద్రంలోని మాతశ్రీ పాఠశాలలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాంపల్లి మండలంలోని తుంగపాడు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి త్రిశూల్ చింతపల్లిలోని మాతశ్రీ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తెలుగు పరీక్ష సరిగ్గా రాయలేదన్న కారణంతో ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో బాలుడి ఒంటిపై వాతలు పడ్డాయి. బుధవారం బాలుడి తాత గమనించడంతో ఉపాధ్యాయుడు కొట్టిన విషయం బయటపడింది. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ అంజన్‌గౌడ్ స్పందిస్తూ సంబంధిత ఉపాధ్యాయుడిని విధుల్లో నుంచి తొలగించినట్లు తెలిపారు.



ఉపాధ్యాయుడు కొట్టడంతో చేతిపై వచ్చిన వాతలు

సిద్ధాపురంలో అగ్ని ప్రమాదం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల పరిధి సిద్ధాపురంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి సమీపంలో వరి పైరు మొదళ్లను కాలుస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు ఇళ్లల్లోకి వచ్చి పడ్డాయి. దీంతో ఇంటి ఎదుట ఉన్న కొబ్బరి చెట్లు కాలిపోతుండగా ఫైరింజన్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలు ఆర్పివేశారు. ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కమెడియన్ రఘుబాబు కారు ఢీకొని

బీఆర్ఎస్ నాయకుడి మృతి

- నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీ వద్ద ఘటన
- రఘుబాబుపై కేసు నమోదు



రఘుబాబుతో వాగ్వాదానికి దిగిన స్థానికులు



బైక్‌ను ఢీకొన్న కారు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ సమీపంలోని లెప్రసీ కాలనీ వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు (48) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం మంగలపల్లి గ్రామానికి చెందిన జనార్దన్‌రావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నల్లగొండలో స్థిరపడ్డాడు. బుధవారం సాయంత్రం లెప్రసీ కాలనీ వద్ద వెంచర్‌లో వాకింగ్ చేసి, బైక్‌పై నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి వస్తున్నాడు. లెప్రసీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు బీఎండబ్ల్యూ కారులో వెళ్తున్న హాస్య నటుడు రఘుబాబు వేగంగా వచ్చి ఇతడి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో జనార్దన్‌రావు మొదట కారు అద్దంపై పడి, ఆ తర్వాత ఎగిరి 100 మీటర్ల దూరంలో పడ్డాడు. బైక్ కారు ఇంజన్‌లో ఇరుక్కుపోయింది. జనార్దన్‌రావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న వారు గమనించి, కమెడియన్ రఘుబాబుతో వాగ్వాదానికి దిగారు. అనంతరం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. రఘుబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జనార్దన్‌రావు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య నాగమణి, కుమార్తె ఝాన్సీ, కుమారుడు భరత్ ఉన్నారు. కుమార్తె ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరగా, కుమారుడు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కమెడియన్ రఘుబాబు అజాగ్రత్తగా కారు నడిపి తన భర్త మృతికి కారణమయ్యాడని నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.



జనార్దన్‌రావు (ఫైల్)

పలువురి సంతాపం..

జనార్దన్‌రావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేష్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకటరెడ్డి, ఐతగోని యాదయ్యగౌడ్, పలువురు వ్యాపారవేత్తలు సంతాపం తెలిపారు.

క్షుద్రపూజల కలకలం

గుండాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పసుపు పోసి, మధ్యలో ఆకులు, పువ్వులు వేసి ఉండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పసుపు, ఆకులు తొలగించి శుభ్రం చేయించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వంగ సాగులో తెగుళ్లు, నివారణ చర్యలు

నడిగూడెం: వేసవి కాలంలో వంగ(వంకాయ) సాగు చేసే రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ షేక్ ఇస్మాయిల్ చెబుతున్నారు. వంగ పంటకు తొలి దశ నుంచి ఆశించే పురుగులు, సోకే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..



షేక్ ఇస్మాయిల్, హార్టికల్చర్ కన్సల్టెంట్



సాగులో ఉన్న వంగ పంట

పాడి పంట

1. **మొవ్వు, కాయతొలుచు పురుగు:** వంగ నారు నాటిన 30–40 రోజుల నుంచి ఈ పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు మొక్క పెరుగుదల దశలో మొవ్వును, తర్వాత దశలో కాయలను తొలిచి నష్టాన్ని కలుగచేస్తుంది. కాయలు వంకర్లు తిరిగిపోతాయి. కొమ్మల చివర్ల పెరుగుదల ఆగిపోతుంది. దీని నివారణకు ఆశించిన కొమ్మలను తుంచివేయాలి. తొలిదశలో వేప నూనె లీటరు నీటికి 5మి.లీ. లేదా కార్బరిల్ 50 శాతం 3గ్రాములు, లీటరు నీటికి, లేదా ప్రొఫెనోఫాస్ 2.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. **రసం పీల్చే పురుగులు (దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ):** ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి, రసాన్ని పీల్చివేయడం వలన ఆకులు పసుపు రంగుకు మారి, పైకి ముడుచుకొని ఎండిపోతాయి. వీటి నివారణకు డైమీథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ లేదా ఫిప్రోనిల్ లీటరు నీటికి 2మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి.

3. **ఎర్రనల్లి:** ఆకుల అడుగుభాగాన చేరి, రసం పీల్చడం వలన ఆకులు పాలిపోయి తెల్లగా మారుతాయి. ఆకులపై సాలెగూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా డైకోఫాల్ 5మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

4. **ఆకుమాడు తెగులు:** వంగ నారును పొలంలో నాటిన తర్వాత 30 రోజులకు ఈ తెగులు ఆశిస్తుంది. ఆకులన్నీ మాడిపోయనట్లుగా కనిపిస్తాయి. ఈ తెగులు ఆశించినపుడు ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తర్వాత పసుపురంగుకు మారి వాడి రాలిపోతాయి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా కన్పిస్తుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు, లేదా కార్బెండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేయాలి.

5. **ఆకుమాడు, కాయకుళ్లు తెగులు:** ఆకులమీద అక్కడక్కడ గోధుమ రంగుతో కూడిన మచ్చలు కన్పిస్తాయి. తెగులు ఉధృతమైతే ఆకులు మాడి రాలిపోతాయి. తెగులు సోకిన కాయలు పసుపురంగుకు మారి కుళ్లిపోతాయి. దీని నివారణకు నారుమడిలో విత్తేముందు 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల వీటిలో విత్తనాలను 30నిమిషాల పాటు నానబెట్టి విత్తుకోవాలి. తెగులు సోకిన పొలంలో పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రాముల మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

6. **వెర్రి తెగులు:** ఆకులు సన్నగా మారి, పాలిపోయిన ఆకుపచ్చని రంగు కల్గి ఉంటాయి. మొక్కలు గుబురుగా, చీపురు కట్టలా కనబడతాయి. దీని నివారణకు నారుదశలో నాటడానికి ముందు 250 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలను 100 చ.మీ. నారుమడికి వేయాలి. ప్రధానంగా పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను తుంచి నాశనం చేయాలి. అంతరపంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లి సాగు చేసుకోవాలి. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 4 చొప్పున పెట్టాలి. తలనత్త ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందికి తుంచి నాశనం చేయాలి. అల్లిక రెక్కల పురుగులను మొక్కకు 2 చొప్పున పంట పెరిగే దశలో విడుదల చేయాలి. ఎకరానికి 200 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేయాలి.